# గాలిపాట

నడిరాత్రి నీరవ నిశ్శబ్దాన్ని కాలింగ్ బెల్ నిలువునా చీల్చింది. తలుపులు తెరుస్తూనే ముందుగా సుడిగాలీ, ఆ వెనకే అతనూ లోపలికి దూసుకొచ్చారు. రంగురంగుల పొడవాటి జుబ్బా కింద నీలిరంగు పాంటు తొడుక్కున్నాడతను. అతడి తల వెంట్రుకలతో బాటూ, పొడవాటి గడ్డం కూడా గాలిలో పాయలు పాయలై యెగురుతోంది. గుండ్రటి కళ్ళజోడు లోపల అతడి చూపులు చుక్కలై వెలుగుతున్నాయి. అతడి భుజానికి వేలాడుతున్న వూదారంగు సంచికి, లోపలున్న వస్తువులేవీ నిర్దుష్టమైన ఆకారాన్ని సంతరించడం లేదు.

"అప్పుడే నిద్రపోయారా బాబాయ్! పిన్ని యెక్కడ? యింట్లో తమ్ముళ్ళున్నారా? లేకపోతే ఉద్యోగాల మాట విని ఊరొదిలిపోయారా?" వచ్చిన వ్యక్తి కుర్చీలో కూచుని తడుముకోకుండా మాటలు మొదలుపెట్టేశాడు.

"గంట యిప్పుడు పన్నెండు దాటింది. అయినా ఈ ఇంట్లో మేమెవరూ నిద్రపోలేదు," అంటూ విసుగ్గా చూశారు హరనాథ్.

"నిద్రపోకుంటే యెడారిలా యిల్లింత మౌనంగా వుందెందుకు? గ్రామ్‌ఫోను రికార్డులూ, రేడియోలూ పాతబడిపోయాయనుకో! కనీసం ఇడియట్‌బాక్సునైనా తెరవలేదా? యింత ఒంటరిగా కూచుని ఏ తపస్సు చేస్తున్నారు మీరంతా?" అని అడుగుతూ, గది తలుపులు తెరుచుకుని వచ్చిన స్త్రీని చూసి, "నేను పిన్నీ! కాళిదాసును. మర్చిపోయానా నన్ను? కొంచెం మంచినీళ్ళయినా యిస్తావా యివ్వవా?" అంటూ పెద్దగా నవ్వసాగాడతను.

"యీ వేళప్పుడు యే రైలులో వచ్చావు నువ్వు?" అని వీలైనంత సౌమ్యంగా అడగడానికి ప్రయత్నిస్తూ ఫ్రిజ్‌లోంచీ నీళ్ళసీసా బయటికి తీసింది శ్యామల. ఆమె గ్లాసుకోసం వెతుకుతుండగానే, సీసా లాక్కుని నీళ్ళన్నీ గటగటా తాగేసి, "ఇప్పుడే స్వరమాధురిలో దిగాను," అన్నాడు కాళిదాసు. విస్తుపోయి చూస్తున్న దంపతులకేసి చిలిపిగా చూస్తూ, "యీ రైలు యెప్పుడు యెక్కడ బయలుదేరిందని అడిగితే నేను జవాబు చెప్పలేను. అయితే

డిల్లోలో అఖిల భారత నాటక సమారోహంలో పదిరోజులు ఆగిందని మాత్రం గుర్తుంది. తర్వాత గ్వాలియర్ హిందుస్థానీ ఘరానాలో నాలుగు దినాలు నిలిచిపోయింది. దారిలో బొంబాయి పంకజ్‌లాల్ ఆర్ట్ గ్యాలరీ చుట్టూ ఆరురోజులు ప్రదక్షిణాలు చేసింది. పూనా యింటర్నేషనల్ ఫిలం ఫెస్టివల్ పిలిచినప్పుడు తప్పదన్నట్టుగా కదిలింది. ఇంతలో మీ వూరి త్యాగరాజు ఆరాధనోత్సవాలు రావలసిందేనని పట్టుబట్టాయి. ఈ రోజు ఉదయం పంచరత్న కీర్తనలకు ఠంచనుగా హాజరయ్యింది. తలుపు తెరిచి వోసారి చూడు పిన్నీ! త్యాగరాజ మండపం దగ్గర పరవళ్ళు తొక్కిన మోహనరాగం మీ ఇంటి గుమ్మం దాకా కెరటాల్ని విసిరికొట్టింది...” అన్నాడు కాళిదాసు.

హరినాథ్ పెద్దగా నిట్టూర్చి, “మీ నాన్నలా గాలికి తిరగడం నీగ్గూడా బాగానే పట్టుబడింది,” అని గొణిగాడు.

“మీ అన్నయ్యేమో హరిదాసు. నువ్వేమో హరనాథ్... నేను కాళిదాసు. మీవాడు రంగనాథ్. మీరంతా నాథ్‌లు. మేమంతా దాసులు..” అంటూ కాళిదాసు గలగలా నవ్వసాగాడు.

యింతలో తూర్పువైపున్న గది తలుపులు తెరుచుకున్నాయి. చీకటిలో కళ్ళు తెరుచుకుని వుండటంతో గుడ్లగూబ ముఖంతో వున్న యువకుడొకడూ, అతని వెనకనుంచి నల్లటినైటీలో గబ్బిలంలాగున్న యువతీ బిడియంగా తొంగిచూశారు.

“చూశావా పిన్నీ! మోహనంరాగం అలవోకగా ఆ తలుపుల్నీ బాదింది,” అన్నాడు కాళిదాసు.

మెల్లగా మాట్లాడమన్నట్టుగా సైగ చేశాక, “యిటువైపు గదిలో శ్రీనాథ్ ఎల్లుండి జరగబోయే ప్లస్ టూ పరీక్షను మచ్చిక చేస్తున్నాడు. పన్నెండేళ్ళుగా వాడు ప్రతి సంవత్సరమూ పరీక్ష నొకదాన్ని పట్టుకొచ్చి మేపుతున్నాడు. అయితే యెంత ప్రయత్నించినా అది తొంభైశాతమే అదుపులోకొస్తోంది. చిన్నప్పుడు నేనూ అంతే.. తర్వాత పెద్దవాడు రంగనాథ్ కూడా అంతే... యెందుకిలా జరుగుతూందో తెలుసుకుందామని అందరమూ కలిసి ఇప్పుడు మోహరించాం. రంగనాథ్, వాడి భార్య నిఖితా నగరంలోంచీ ఐటీ వుద్యోగాల దగ్గర అనుమతి తీసుకొని కొత్తకొత్త ఆయుధాలతో వచ్చారు. రంగనాథ్ చేతుల్లోని త్రీ యిన్ వన్ హంటర్ని చూడు. వాడి భార్య చేతుల్లోని ఆల్ యిన్ వన్ జీనుల్ని చూడు. చుట్టూ పద్మ వ్యూహాన్ని నిలబెట్టి, మధ్యలో చిన్నవాడ్ని కూచోబెట్టి మేమంతా దళాధిపతులై నిలబడ్డాం. బుద్ధిగా కాస్త తిని, దొంగలా పడుకుని, తెల్లారేసరికల్లా నీ గాలిపాటను తీసుకొని మరో పిచ్చి మజిలీని చేరుకో... తొందరపడి ఈ వ్యూహం దగ్గరికొస్తే నీ గతి అభిమన్యుడి గతే!” అన్నాడు హరనాథ్ గంభీరంగా.

"యీ గాలి పొమ్మంటే పోదు... వుండమంటే వుండదు. మూడురోజుల కర్ణాటక సంగీత విభావరి విరిసిందీ వూళ్లో... వుదయం, సాయంత్రం, రాత్రీ మూడు కచేరీలు, అప్పుడప్పుడూ నాట్య ప్రదర్శనలు బోనస్. యీ వూర్లోకొచ్చి హోటల్లో దిగానని తెలిస్తే నాన్న వూరుకోడు. నువ్వు పొమ్మన్నా నేను ఈ మూడురోజులూ యిక్కడే వుంటాను," అన్నాడు కాళిదాసు యీల వేస్తూ.

రంగనాథ్ దంపతులు గోడకు 'గుడ్‌నైట్' చెప్పి అద్దంలోంచీ జారిపోయే నీడల్లా తలుపుల వెనుక మాయమైపోయారు.

రెండు ఆపిల్సు, రెండు అరటిపళ్ళు, గ్లాసెడు పాలు తీసి టీపాయ్ పైన పెట్టి, "యీ వేళప్పుడు అన్నమేం తింటావ్! యివైనా తీసుకో. అవతలి గదిలో మంచముంది. ఫేను వేసుకొని పడుకో..." అని గబగబా సూచనలిచ్చాక శ్యామల చిన్నకొడుకు గదిలోకెళ్ళి నిద్రను అవతలికి తరిమే పని మొదలుపెట్టింది.

హరనాథ్ మళ్ళీ నిట్టూర్చి, "అయితే మీ నాన్నెక్కడున్నాడో నీకైనా తెలుసునన్న మాట. యిద్దరికిద్దరే మీరు. నువ్వు వడగాలి, మీ నాన్న సుడిగాలి," అంటూ సమాధానం కోసం యెదురుచూడకుండా తన గదిలోకెళ్ళిపోయాడు.

కాళిదాసు మంచాన్ని బారెడు వెడల్పున్న బాల్కనీలోకి లాక్కుని, మూరెడు ఆకాశపు తునకను నంజుకుంటూ పళ్ళు తిని, పాలు తాగి, నిద్రలోకి మునకేశాడు. మరునాటి వుదయాన యెత్తయిన యిండ్ల పైకెక్కిన ఎండ వాడివాడి చేతుల్తో గుచ్చాకగానీ అతను లేవలేదు.

స్నానాల గదిలో దూరి, మంచినీళ్ళతో నిద్రమత్తును కడిగేసుకున్నాక యమన్‌కళ్యాణ్ రాగం వేలు పట్టుకుని బయటికొచ్చాడు కాళిదాసు. లాప్‌టాప్‌తో కలిసి ఏదో వెతుక్కుంటున్న మరదలితో, "ఆలాపన వినాలంటే హిందుస్థానీనే వినాలి నిఖితా! కానీ శుద్ధమైన స్వరగానం కావాలంటే కర్ణాటకే గతి. నిన్న రాత్రి పాల్ఘాట్ సోదరీమణులు ఆనందభైరవినో పట్టుపట్టి చూశారు. వాళ్ళు స్వరపేటికలో నొక్కేకొద్దీ అది పలచనై, చివరకు నూలుపోగంత సన్నగా ఏకధారై చిమ్మింది చూడూ..." అంటూ రాత్రి తిన్న సంగీతాన్ని నెమరేయసాగాడు.

లాప్‌టాప్‌తో బాటూ తారట్లాటలో దారి తప్పిపోయిన నిఖిత అనుకోకుండా చేతికి దొరికిన ఆతానాను రెడ్‌హాండెడ్‌గా పట్టుకుంది. ఫలహారంతో బాటూ రెండు టుమ్రీలు నంజుకున్నాక కాళిదాసు తన నిరాకారపు సంచిని తగిలించుకుని, దూరం నుంచీ పిలుస్తున్న మధ్యమావతి ఆధారంతో దారి చేసుకుంటూ వెళ్ళిపోయాడు.

నిఖిత కాస్సేపు తన ఉనికిని పట్టించుకోని లాప్‌టాప్ నెత్తిపైన టప్పున మొత్తింది. అంతవరకూ దొరకని మేఘమొకటి ప్రేమగా దగ్గరికి రాగానే అతానాతో బాటు దానిపైకెక్కి కూచుంది. అల్లరి చేయబోతున్న అతానాను సముదాయిస్తూనే లాప్‌టాప్‌తో చేతులు కలిపింది. పదకొండు గంటలప్పుడు గ్లాసెడు వుత్సాహాన్ని తీసుకొచ్చిన అత్తగారికి బలవంతంగా అతానా నందించింది. పరాయి బిడ్డను తెచ్చుకుని పని పాడుచేసుకుంటున్న కోడలిని విసుక్కుంటూ శ్యామల పిల్లదాన్ని చంకనెత్తుకుంది. ఆ సమయం కోసమే ఎదురుచూస్తున్నట్టుగా అతానా ఆమె చీరను తడిపేసింది. కోపంగా ఆమె దాన్ని నిఖిత వొళ్ళో కుదేసి, విసవిసా వంటగదిలో కెళ్ళిపోయింది. ఎంతకూ అల్లరి మానని అతానాను తీసుకెళ్ళి, తన గదిలో పెట్టి, తాళం తగిలించింది నిఖిత. మధ్యలో అప్పుడప్పుడూ చంటిపిల్ల గుర్తుకొస్తున్నా, లాప్‌టాప్‌తో అయిష్టంగానే కాలం తోసింది. మధ్యాహ్నం భోజనాలయ్యాక, యెవరూ చూడని సమయంలో, కాస్సేపు అతానాతో ఆడుకుని, మళ్ళీ దాన్ని గదిలోనే బంధించింది.

రెండు గంటల తర్వాత యింటికొచ్చిన కాళిదాసుతో, “యీ పూట యే రాగంతో కడుపు నింపుకున్నావో! యిప్పుడు భుక్తాయాసం తీర్చుకో,” అంది శ్యామల వెక్కసంగా.

కాళిదాసు నిరాకారపు సంచితోబాటు కుర్చీలో కూచుని, “దొరకిందని అబగా తినేస్తే యేదైనా మందగిస్తుంది పిన్నీ! మళ్ళీ సాయంత్రం విందు కెళ్ళినప్పుడు యిష్టమైనవి దొరికినా తినే వీలుండదు. యీలోగా తిన్నది జీర్ణం కావాలి. నువ్వు వడ్డించబోయే అన్నమే దానికి ఔషధం,” అన్నాడు. మూడుగంటల నుంచీ అయిదు వరకూ ఫేను కింద నిద్రని ఆరేశాక, సాయంత్రపు విందుకు తరలిపోయాడతను.

రాత్రి వొంటిగంటకు మళ్ళీ కాలింగ్‌బెల్ పిలిచింది. తనతోబాటూ భుజంపైన చేయి వేసుకుని తీసుకొచ్చిన పిల్లవాడ్ని చూపెడుతూ, “భైరవ్‌తో కలిసి కచేరీలో మంగళం పాడడం హిందుస్థానీ సంప్రదాయం పిన్నీ! మెహిఫిల్ నుంచి నన్నెప్పుడూ వొంటరిగా రానివ్వడీ భైరవ్... యెంత ఆలస్యంగా వచ్చినా అతిథుల్ని ఆదరించడం మన ఆచారం గదా! మరేమీ అనుకోకుండా మా ఇద్దరికీ వడ్డించు,” అన్నాడు కాళిదాసు.

శ్యామల డైనింగ్ టేబుల్‌పైన రెండు తట్టల్ని దభేలుమని శబ్దమొచ్చేలా పెట్టి, “మిగిలిందిదే! ఇద్దరూ సర్దుకోండి,” అంటూ ఓ చిన్నగిన్నెను ముందుకు తోసింది.

“కావాలంటే నా భాగం కూడా అతిథికే పెట్టు పిన్నీ! అతడి కడుపు నిండితే నా కడుపూ నిండినట్టే...” అన్నాడు కాళిదాసు.

"అది నీ ఇష్టం.. శ్రీనాథ్ గదిలో యిప్పుడు మీ బాబాయి డ్యూటీ చేస్తున్నాడు. రేపు పరీక్ష జనరల్ నాలెడ్జిలోనట... కరెంటఫయిర్సు కోసరం భోషాణాల్ని తిరగేసి మరగేస్తున్నారు," అంది.

"అయ్యో! జనరల్ నాలెడ్జీ ఆ పాడు దినపత్రికల దొడ్లలో దొరకదు పిన్నీ!" కాళిదాసు మొత్తుకున్నాడు. "అసలైన విజ్ఞానం బోధించడంలో షేక్స్పియర్ యిన్స్టిట్యూట్‌కు పెద్ద పేరుంది. ఆయన దగ్గర హామ్లెట్, మెక్‌బెత్, పోర్షియా, వయోలా మొదలైన గొప్ప ఉపాధ్యాయులెందరో వున్నారు. యిక వేదవ్యాసుడిది పెద్ద విశ్వవిద్యాలయమే ననుకో! వీళ్ళంతా పాతవాళ్ళని కొట్టి పారేయలేవు నువ్వెప్పటికీ... శరత్‌చంద్ర చటర్జీ పేరు విన్నావా నువ్వు? ఆయన స్కూల్లో శ్రీకాంత్ అనే మాస్టారున్నాడు చూడూ-అతని పాఠం నువ్వొకసారి వింటే మళ్ళీమళ్ళీ అదే వినాలంటావు... ఇంకా టాల్‌స్టాయ్ అనీ, డాస్టోవిస్కీ అనీ, స్టెయిన్‌బెక్ అనీ చాలాచాలా మంది గొప్ప టీచర్లున్నారు..."

"నువ్వు చెప్పే యీ పేర్లు నేనెప్పుడూ విన్లేదు. పిల్లాడికి తెల్లారుతూనే పాఠం చెప్పే బాధ్యత నాది. అందాకా కాస్త కునుకుతాను," అంది శ్యామల.

"ఆగాగు పిన్నీ..." అంటూ కంగారుగా పిలిచాడు కాళిదాసు. "మనింట్లో యెంగిలి పడ్డాక మనకేదైనా యివ్వకపోతే యీ భైరవ్‌కు తృప్తిగా వుండదు. పోతేపోనీ, నీ గదికి తీసుకెళ్ళు... నీకు నిద్ర వచ్చేవరకూ జోకొడతాడు."

ముఖం అవతలికి తిప్పుకుని గదిలో కెళ్ళిన శ్యామలనే చూస్తున్న భైరవ్‌తో, "మా పిన్ని నిద్రపోగానే నువ్వు నా గదికొచ్చేయ్... నువ్వొచ్చేదాకా మేలుకునే వుంటాను," అన్నాడు కాళిదాసు.

మంచాన్ని బాల్కనీలోకి లాక్కుని మిగిలిన ఆకాశ శకలాన్ని తిని కడుపు నింపుకోడానికి ప్రయత్నించాడు కాళిదాసు. యెంతకూ భైరవ్ తన గదికి రాకపోయేసరికి గదిలోకి తిరిగొచ్చి దీపం వెలిగించుకున్నాడు.

వుదయం తొమ్మిది గంటలప్పుడు రంగనాథ్ తన లాప్‌టాప్ కోసం వెతుక్కోసాగాడు. చివరకు కాళిదాసు మంచం పక్కన జాగారం చేస్తూ కనిపించిందది. మండిపడుతూ దాని చెవి మెలేశాడు అతను. అది సరికొత్త ఫైళ్ళను సంతరించుకున్న ఆనందంతో తుళ్ళింతలాడింది. రంగనాథ్ మందలిస్తున్నా వినకుండా పెద్దగా అరవసాగింది– "రాత్రంతా ఆకాశపు కొలనులో నక్షత్రాలు యీదుతున్నాయి... వొంటరితనంతో చెయ్యి కలిపి పిల్లగాలి వద్దన్నా నాట్యం చేస్తోంది.... నిన్న ఆతిథ్యమిచ్చిన స్వరాలు నేడూ వుండిపొమ్మంటున్నాయి... రేపు వస్తామన్న రాచిలుకలు యివ్వాళే వచ్చాశాయి.. కనురెప్పల వెనుక చేరి కవ్వింతలై

వెలిగాయి.. గుండె గుడారంలోకి ఒంటెల్లా చేరి వేళ్ళ కొసల్ని వ్యక్తీకరించాయి.. వేళ్ళు తగిలిన కొమ్మలంతా... చెమరింతల్ని పూసాయి..." అంటూ లాప్‌టాప్ పాట సాగింది.

"భైరవ్ రాత్రంతా పిన్ని గదిలోనే వుండిపోయాడు. నాకు నిద్ర పట్టలేదు. నేను ఒంటరిగా మేల్కొన్నానని, పాపం నీ లాప్‌టాప్ తల్లడిల్లిపోయింది. రాత్రంతా ఇలాగే నన్ను అడించింది," అన్నాడు కాళిదాసు నిద్ర లేచి ఆవులిస్తూ. కాస్సేపటి తర్వాత, "నా అల్లరిని తట్టుకోలేక కాగితాలు అలిసిపోయేవి. కానీ లాప్‌టాప్‌కు అలసటే రాలేదు. కావాలంటే ఆటంతా చెరిపేసి కొత్త ఆటకు సై అంటోంది. నాకూ యిలాంటి దొకటుంటే అప్పుడప్పుడూ నాదైన ఆట ఆడుకుంటాను గదా అనిపిస్తోంది," అన్నాడు.

"ఇది గాలికి పుట్టి గాలికి పెరిగే పిల్లల్లాంటిది కాదు. యిది కావాలంటే నువ్వూ నాలాగా కష్టాలతోనూ ఆడాలి...." అంటూ రంగనాథ్ కసిరాడు.

చన్నీళ్ళతో నిద్రలేమిని చల్లార్చాక, బడలికకు ఆహారపు ఔషధాన్ని పెట్టాక, భైరవ్ కోసం మళ్ళీ యిల్లంతా వెదికాడు కాళిదాసు. చివరకు విసిగిపోయి కేదార్ రాగాన్ని పిలిపించుకుని, తోడు పెట్టుకొని వెళ్ళిపోయాడు.

మధ్యాహ్నం లాప్‌టాప్ పక్కన కూచున్న భర్త దగ్గిరికొచ్చిన నిఖిత, "యింట్లో ఇద్దరు పిల్లలు ఎవరికీ తెలియకుండా అడుకోవడం చూశారా మీరు?" అని ప్రశ్నించింది. రంగనాథ్ పరధ్యానంగా యెటో చూస్తూ," యీ అల్లరి పిల్లాడు యింత గారం చేయాలా నన్ను మురిపించడానికి... నా లోపల యిన్ని రాగాలు ఆడాలా నువ్వొచ్చి వాలడానికి..." అన్నాడు.

భర్త మాటలు అర్థంగాకపోయినా, "లాప్‌టాప్ లోంచీ వచ్చి మీ భుజంపైన వాలిన యీ బుల్లిపిట్ట ఎంత బాగుందో..." అని మురిసిపోయింది నిఖిత. అంతలో వులిక్కిపడి, "యిదేం పిచ్చి మనకు... ఉదయమంతా శ్రీనాథ్‌ను భౌతికశాస్త్రంలోకి తోలాను. యిక మీరెళ్ళి లెక్కల్లోకి తరమండి," అంది.

ఒంటగంటన్నరకు, నడిరాత్రి తలుపుల్ని బాదుతుండగా దిగ్గున లేచింది శ్యామల.

"కోప్పడకు పిన్నీ, ఈ సత్యభామ ఒకరి మాట వినేది కాదు. భామాకలాపం ముగిసినా శ్రీకృష్ణుణ్ని వెతకడం మానదు. యెంత చెప్పినా వినకుండా మన యింట్లో వున్నాడేమోనని వెంటే వచ్చింది. అయినా యేమాట కామాటే చెప్పుకోవాలి. యీవిడగారికి అలిగే కొద్దీ అందం పెరిగిపోతోంది. అందుకేనేమో, పాపం ఆ శ్రీకృష్ణుడు ఈ భార్యంటే పడి చస్తాడు..."

శ్రీకృష్ణుడి పేరెత్తగానే యింట్లోని దేవుడిగది జ్ఞాపకం రావడంతో శ్యామల భయంతో చెంపలేసుకుంటూ వుండిపోయింది.

"యీవిడ స్నేహితురాలొకతి వొరిస్సాలో వుంది. యింకో స్నేహితురాలు రాజస్థాన్‌లో వుంది. వీళ్ళందరికీ పెద్దన్నొకడు కేరళలో వుంటాడు. అతగాడు మీసం దువ్వుకుని, జూలు దులుపుకుని రంగంలోకి దూకాడే అనుకో, యిక మన బతుకంతా కథాకళే!...." తింటున్నప్పుడు కూడా కాళిదాసు చెబుతూనే వున్నాడు.

తన గదిలోకెళ్ళి తలుపులు మూసుకున్నాక కూడా బాల్కనీలో సత్యభామ కాళిదాసుకు భర్తపై చెబుతున్న చాడీలే వినబడసాగాయి శ్యామలకు. యెప్పుడో ఆదమరిచి నిద్రపోయి, తరువాత అలారం గడియారం కూతకు మేలుకుంది. అప్పటికీ బాల్కనీలో దీపం వెలుగుతూనే ఉంది. పగటి వెలుతురు పరుచుకున్న తర్వాత దీపం వెలుతురు పాలిపోయింది. అనవసరంగా వెలుగుతున్న దీపాన్ని ఆర్పుదామని బాల్కనీలోకొచ్చిన హరనాథ్ నిశ్చేష్టుడై నిలబడిపోయాడు. అతను శ్రీనాథ్ కోసం తెచ్చిన తెల్లకాగితాలు, భార్యకోసం తెచ్చిన రవిక గుడ్డలు, రంగనాథ్ కట్టబోతున్న యింటికోసం తీసుకొచ్చిన ప్లైవుడ్లూ హోలీ ఆడుకుంటున్నాయి.

"రాత్రి యీ సత్యభామ ఎంత చెప్పినా వినకుండా తన స్నేహితురాళ్ళనూ, బంధువులనూ పిలిచి శ్రీకృష్ణుడితో మద్దిస్తం పెట్టింది. వాళ్ళందర్నీ శాంతింపజేయ డానికి పండగ చేయక తప్పలేదు... నువ్వు తీసుకొచ్చిన వాళ్ళందరూ యిప్పుడు యెంత ఆనందంగా వురకలేస్తున్నారో చూశావా బాబాయ్..." అన్నాడు కాళిదాసు మంచంపైన లేచి కూచుని.

"మా యింట్లో వుండే రంగులు రెండే-తెలుపూ, నలుపూ....రాత్రికిరాత్రి యిన్ని రంగుల్నెలా తెచ్చావురా నువ్వు?" అని ఆశ్చర్యపోయాడు హరనాథ్.

"భలేవాడివిలే బాబాయ్ నువ్వు! యీ రంగులన్నీ మీ ఇంటి చుట్టూ దొరికినవే.. అటు ఆకాశంకేసి చూడు- నీలి రంగు. బాల్కనీలోనికి వాలుతున్న కొమ్మల్ని చూడు- ఆకుపచ్చ. కొమ్మల మధ్యలో చూడు... మొగ్గలూ పువ్వులూ యెరుపు రంగు... తెల్లవారు ఝామున ఆకాశంలోకి చూశావా బాబాయ్ నువ్వెప్పుడైనా? అక్కడ ప్రతిరోజూ హోలీనే... ఆ రంగులన్నింటినీ యెంత ప్రాధేయపడ్డానని...! కానీ కొన్నే వచ్చాయి. చూస్తూ వుండు. అన్నింటినీ తీసుకొచ్చే రోజు దూరంలో లేదు..." కాళిదాసు ఏదో వుద్రేకంలో వున్నట్టున్నాడు.

"బాగానే వుందిలే.. ఆ రంగులు నీ చేతుల్నీ, బట్టలనీ ఒదలడంలేదు చూడు... వాటినంతా స్నానాలగదిలోకి తరుము ..." అని మందలించాడు హరనాథ్.

"యివి భలే గడసరివి బాబాయ్... కొన్ని రమ్మన్నా రావు. మరికొన్ని పొమ్మన్నా పోవు..." అని ప్రేమగా నిమురుతూ పైకి లేచాడు కాళిదాసు.

ఫలహారం వడ్డిస్తూ శ్యామల మర్యాదకు అనక తప్పదన్నట్టుగా, "శ్రీకృష్ణుడు మా యింట్లో లేడని తెలిశాక మీ సత్యభామ మా యింట్లో ఆగదేమో!..." అంది.

"ఆ సంగతి ప్రత్యేకంగా చెప్పాలా పిన్నీ... చూడు ఆవిడెంత విసవిసానడుస్తోందో! మళ్ళీ ఎప్పుడైనా తీసుకొస్తాలే..." అంటూ కాళిదాసు సత్యభామ వెనకే పరిగెత్తాడు.

అతానతో వేగలేక కాళిదాసు కప్పగించేయడం కోసం మధ్యాహ్నం చాలాసేపటి వరకూ ఎదురుచూసింది నిఖిత. కానీ అతగాడు రాత్రి రెండుగంటలకుగానీ తిరిగి రాలేదు.

"శ్రీనాథ్‌కు రేపే యుద్ధం. గదిలో వాడు పరీక్షను బుజ్జగిస్తున్నాడు. వాడి దగ్గరికి రానివ్వకుండా నిద్రను అటకాయిస్తూ మేమంతా కాపుగాస్తున్నాం. నువ్వు అల్లరి చేయకుండా బాల్కనీలోకి వెళ్ళు..." అని గుసగుసగా చెప్పాడు హరనాథ్.

కుర్చీలో కూచున్నాక, "కాపుగాయడమంటే ఇదేనా బాబాయ్! అటుచూడు, పిన్ని తూలుతోంది. రంగనాథ్ జోగుతున్నాడు. పాపం, నిఖిత కునికేసుంది. వోసారి త్యాగరాజ మండపం దగ్గరికొచ్చి యువనిక దగ్గర నేర్చుకోవాలి మీరందరూ! తెల్లవారినా అది కంటిపైన రెప్పేయదు... అయితే దానితోపాటూ నిలదొక్కుకోగల్గిన వాళ్ళెందరని మాత్రం నన్ను అడగద్దు... గంగిగోవు పాలు ఎంత కావాలి చెప్పు?" అన్నాడు కాళిదాసు.

పెద్దగా ఆవులించాక, "అంత శక్తి దానికెలా వచ్చిందిరా?" అని అడిగాడు హరనాథ్.

"అదే బాబాయ్ గమ్మత్తు. అక్కడ రంగులూ రాగాలూ కలిసి నాట్యం చేస్తాయి. ఆలోచనా అనుభూతీ కలిసి చర్చలు జరుపుతాయి. గతమూ వర్తమానమూ కలిసి భవిష్యత్తును సేదతీరుస్తాయి. యింతకూ యీరోజు అక్కడ కలిసినవాడు కొత్తవాడేమీ కాదు. కానీ వాడు రంగంపైకి రాగానే అర్జునుడైపోయాడు. "అదిగో ద్వారక... ఆలమందలవిగో," అంటూ వాడు ఆలపించగానే ద్వారకకు ద్వారకే మా ముందు కొచ్చేసింది. ఇక దుర్యోధనుడూ, శ్రీకృష్ణుడూ, ధర్మరాజూ, ద్రౌపదీ మొత్తం కురువంశ మంతా తల్లి వెనక పరిగెత్తుకొచ్చే పిల్లికూనల్లా నడుచుకొచ్చేశారంటే నమ్ము!"

హరనాథ్ నోరు నొప్పేట్టాలా ఆవులించాక, "అదిగో ద్వారక... ఆలమందలవిగో..." అని కీచు గొంతుకతో పాడబోయాడు. నిఖిత వులిక్కిపడి కళ్ళు తెరచి, "అతానా మళ్ళీ నిద్ర లేచిందా?" అని కంగారుపడింది. శ్యామల తల విదిలించుకుంటూ ముందుకు వంగి, "మళ్ళీ సత్యభామను తీసుకొచ్చావా?" అని గీపెట్టింది, రంగనాథ్ బద్ధకంగా నీల్గి, "ఎన్ని చేతనలను తరిమిగొట్టాక ఒక్క సృజన పలకరించింది?" అని గొణిగాడు.

అనుకోకుండా తల తిప్పిన హరనాథ్, "నువ్వెప్పుడొచ్చావురా శ్రీనాథ్? పరీక్షనక్కడ వదిలిపెట్టి ఇక్కడేం చేస్తున్నావు?" అని గొల్లుమన్నాడు.

చేజారుతున్న 'ఆల్ ఇన్ వన్' గట్టిగా పట్టుకుంటూ శ్రీనాథ్ గదిలోకి పరిగెత్తాడు.

"నువ్వు మీవాళ్ళందర్నీ బాల్కనీలోకే రమ్మను. యిక్కడైతే పిల్లాడికి యిబ్బంది. వాళ్ళు రాకపోతే మాకు నిద్రొచ్చేటట్లుంది. మేమంతా కుర్చీలు తిప్పుకుని బాల్కనీకేసి తిరుగుతాం..." అన్నాడు హరనాథ్ కాళిదాసుతో.

"మరేం పర్వాలేదులే బాబాయ్! మావాళ్ళకు మూకాభినయం కూడా వచ్చు. యిప్పుడు చూసుకో తమాషా..." అంటూ కాళిదాసు బాల్కనీలోకెళ్ళి కూచున్నాడు.

కాస్సేపటి తర్వాత తిరిగి చూస్తే శ్రీనాథ్ గడప దగ్గర తొంగిచూస్తూ కనిపించాడు. తండ్రి వురిమి చూడగానే లోపలికి గెంతి తలుపేసుకున్నాడు.

తూర్పున చీకటి పలచబడ్డాక కాళిదాసు బాల్కనీలోనే చాపలు పరిచేశాడు. మిత్రులతో బాటు అక్కడే పడుకుని నిద్రను ఆహ్వానించాడు.

శ్రీనాథ్‌ను లేపి, కడిగి, కొత్త మెరుపులొచ్చేలా తోమి, పరీక్ష పై కెక్కించి, హాల్‌టికెట్ తోడుబెట్టి యుద్ధరంగంలో దించి వచ్చాడు హరనాథ్.

ముఖంపైకి మంచినీళ్ళు చిలకరించుకుంటూ, "యెక్కడికెళ్ళిందీ అతానా? చంటిది చంకలో లేకపోతే యేవీ తోచడంలేదు," అంది నిఖిత లాప్‌టాప్ దగ్గరికి అయిష్టంగా నడుస్తూ.

"యెన్ని గమ్యాలు గడిచాక తెలిసింది, తెలియని గమ్యాలు తలుపులు తడుతున్నాయని," అంటూ రంగనాథ్ తన లాప్‌టాప్‌కు కొత్త పాఠం నేర్పసాగాడు.

శ్రీకృష్ణుడి కోసం వెతుక్కుంటూ వెళ్ళిన సత్యభామ యిటు వస్తుందేమోనని యెదురుచూస్తూ శ్యామల గడప దగ్గరే నిలబడిపోయింది.

యింటి చుట్టూ యింతవరకూ అపరిచితులుగానే వుండిపోయిన రంగులనంతా పేరుపేరునా పిలవసాగాడు హరనాథ్.

యుద్ధం నుంచీ వచ్చిన శ్రీనాథ్, "రాత్రి పెదనాన్న మధురవాణితో మాట్లాడు తుండడం దొంగతనంగా విన్నానా? అప్పుడు సరిగ్గా నా మేజాలో దాక్కున్న పుస్తక మొకటి తనంతట తానే వచ్చి నన్ను లాక్కెళ్ళింది. అంతవరకూ దాన్ని గమనించనే.లేదు నేను... యీసారి పరీక్ష నన్ను నూరుశాతం నమ్మేసింది...." అన్నాడు హుషారుగా.

అప్పుడే హడావుడిగా యింట్లోకొచ్చిన కాళిదాసు అయిదుగురి ముఖాల్లోనూ తొలిసారిగా వెలుగుతున్న నవ్వుల్ని ఆప్యాయంగా పలకరించాక, "నా రైలు మళ్ళీ బయల్దేరుతోంది. రేపటికంతా ధార్వాడ్ చేరాలి... మీకు చెప్పేసి వెళ్దామని వచ్చాను. సెలవు," అన్నాడు.

"నువ్వంటే శ్రీనాథ్‌కు పరీక్ష బాగా మచ్చికవుతోంది. యింకోరోజు ఉండరాదా? రేపు కూడా వుంది యుద్ధం..." అని హరనాథ్ ప్రాధేయపడ్డాడు.

"వుందామనే వుందిగానీ, యీ సంచిలో వున్న రాలుగాయిలు మొరాయిస్తున్నాయి. మళ్ళీ యీ వూరొచ్చే పనిబడకనే పోతుందా? అప్పుడు తప్పకుండా వస్తాను," అన్నాడు కాళిదాసు నిరాకారపు సంచిని ప్రేమగా తడుముతూ.

"పోనీ అతానానూ, సత్యభామనూ, రాగాల రంగుల్నీ మరికొన్ని రోజులు మా దగ్గర విడిచి వెళ్ళు," అంది శ్యామల వినయంగా.

"దాందేం భాగ్యం! ఉంచుకోండి. అయినా మీతో ఉన్నంతమాత్రాన వాళ్ళు నన్ను విడిచిపెడతారా యేమైనానా? మీ లాప్‌టాప్‌తో ఆడుకోవాలని వాటికీ ఉంది. వాళ్ళకోసం నేనూ ఓ లాప్‌టాప్‌ను తీసుకొచ్చి, వాళ్ళ ఆటలన్నీ నేర్పిస్తాను... తమ్ముడు చెప్పినట్టుగా వాళ్ళకోసమైనా నేను కొన్ని కష్టాల్ని కొని తెచ్చుకుంటాను. గాయాల్ని చేసుకున్నాకే గదా వెదురుకొమ్మకు పాటలు పుట్టాయి?... నేనూ...కొంతైనా... నాకంతగా పట్టుబడకపోతే నేర్చుకోవడం కోసం మీ యింటికే వస్తాన్లెండి..." అంటూ కాళిదాసు నిరాకారపు సంచిని తగిలించుకుని ఎగిరిపోయాడు.

యిందాకా కాళిదాసుతోబాటూ యింటిలోపలికొచ్చిన పంతువరాళి బాల్కనీలోంచీ నిక్కి బయటికి చస్తూ కనిపించింది.

"చంటిపిల్ల పడిపోతుంది. వెళ్ళి పట్టుకోరా శ్రీనాథ్...." అంటూ నలుగురూ ఒకేసారి పైకి లేచారు.

ఉగాది ప్రత్యేక సంచిక చినుకు, 2008